## బచ్చాగా కెటీఆర్ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు

# పంపుతావా

- కెటీఆర్ ఆరోగ్యం గురించి ఆలోచించాలి
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**మిర్యాలగూడ సెప్టెంబర్ 18:–** కేటీఆర్ బచ్చగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్ కి పంపిస్తావా బచ్చా మాటలు మానుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మూడవ స్థానంలో కూర్చోబెట్టినప్పటికీ ఇంకా తెలుసుకోలేకపోతున్నాడన్నారు.అతని ఆరోగ్యం గురించి ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.మిర్యాలగూడ పట్టణంలో 180 కోట్ల రూపాయలతో చేపట్టిన నాలుగు అండర్ పాస్ లా నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు.వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం.. అప్పటివరకు వై జంక్షన్ లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ని జిఎంఆర్ సంస్థకు అప్పగిస్తే.. పనులు చేయకపోవడంతో 1600 కోట్ల రూపాయలు విలువైన ఒప్పందాన్ని ఫోర్ క్లోజ్ చేయించి కొత్తగా పనులు ప్రారంభించేందుకు ఈనెల 24న టెండర్లు పిలువనున్నాం.నవంబర్ మొదటి వారం లేదా రెండవ వారంలో విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారి 6 లైన్ల విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు చేపట్టింది కాంగ్రెస్ పార్టీ అని, లైనింగ్ చేపట్టింది కాంగ్రెస్ పార్టీ.. అప్పటినుంచి ఇప్పటివరకు కాలువను ముట్టుకోలేదన్నారు.నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా ఐటిపాముల వరకు గ్రావిటీతో రెండు పంటల కు నీరు పారించుకొని మన రైతులు వ్యవసాయం చేస్తున్నామన్నారు.భవిష్యత్తులో వచ్చే ప్రమాదాన్ని గుర్తించే తాను ఎస్ఎల్బిసిని ప్రతిపాదించానన్నారు.చెరువులు నింపుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఎస్ఎల్బిసి సొరంగం పనులు పూర్తయితే 4 లక్షలు ఎకరాలకు సాగునీరు అందుతుంది అందుకే 2 ఏళ్లలో ఎస్ఎల్ బిసిని పూర్తి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నానన్నారు.ఈనెల 20న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో కలిసి ఎస్ఎల్బీసీని సందర్శించనున్నామన్నారు.ఎస్ఎల్బిసి తో పాటు ఆలేరు భువనగిరి తదితర నియోజకవర్గాలలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు బడ్జెట్లో నిధులు పెట్టామన్నారు.ఆర్ అండ్ బి ద్వారా ఆరునెలల్లో జిల్లాకు 516 కోట్లు తీసుకువచ్చానన్నారు.మరిన్ని నిధులు తెచ్చి జిల్లా వ్యాప్తంగా రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు.న్యాక్ సహకారంతో మిర్యాలగూడలో 10 కోట్ల రూపాయలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు మంజూరు చేశామన్నారు.నీళ్లు, నిధులు, నియామకాలతో తమ ప్రభుత్వం ముందుకెళుతున్నదన్నారు. మిర్యాలగూడ పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తాం, రోడ్లు నిర్మిస్తామన్నారు.గత ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు.రెండు లక్షల కోట్లతో కాళేశ్వరాన్ని కట్టింది.. ప్రాజెక్టు కూలిందన్నారు.నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి అమృత్ పథకం కింద మిర్యాలగూడ పట్టణానికి రూ.316 కోట్లు తీసుకువచ్చారన్నారు.దీంతో ఎస్టీపి నిర్మాణం, 20 ఎంఎల్డీ తాగునీటి ట్యాంకులు నిర్మాణాన్ని డ్రైన్లను చేపట్టనున్నామన్నారు.వచ్చే నెలలో రేషన్ కార్డులతో పాటు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు.500 రూపాయలకి ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు.200 యూనిట్ల లోపు వారికి జీరో విద్యుత్ను అందిస్తున్నాం.డిసెంబర్లో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా ఒక యూనిట్ ను, మార్చిలో రెండో యూనిట్ ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఇస్తామన్నారు.












నవభూమి

నల్లగొండ

అనుబంధం

19 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


## కుల, మత, ప్రాంతీయ భేదాల

# ప్రసక్తే లేదు..



**భువనగిరి –నవభూమి:** కుల, మత ప్రాంతీయ భేదాల ప్రసక్తే లేని ఉద్యమమే సాయుధ రైతాంగ పోరాటమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అన్నారు. మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలోని రావినారాయణ రెడ్డి స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. భూమి, భుక్తి కోసం వెట్టి చాకికీ విముక్తి కోసం పేదలతో బందూకులు పట్టించి దొరలు, జాగీరుదార్దార్లు, రజాకార్లకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు కులమతాలకతీతంగా పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. దేశంలో బీజేపీ విధానాలు ప్రజల మధ్యన ఐక్యతను దెబ్బతీస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందన్నారు. రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, నాయకులు బట్టుపల్లి అనురాధ, దయ్యాల నర్సింహ, మాటూరి బాలరాజు, దాసరి పాండు, వెంకటేశ, ముత్యాలు, రాజు, మల్లేశ, ప్రకాశ, యాదగిరి, మహేందర్, షరీఫ్ ఉన్నారు.



## ప్రతి చేనేత కార్మికుల సమస్యల కోసం కృషి

## అంగన్వాడీ బాలలకు అన్నప్రాసన



**మిర్యాలగూడ నవభూమి సెప్టెంబర్ 18–:** పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీఓ ఆర్.మమత ఆధ్వర్యంలో బండమీదగూడెం సెక్టార్ పరిధిలోని కాల్వపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం షెడ్యూల్ ప్రకారంగా 6 నెలల 6 రోజులు నిండిన పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించి వయసుకు తగిన ఆహారాన్ని పరిచయం చేస్తూ ఆహార పరిమాణం, వయసుకు తగినవిధంగా ఆహారం రోజుకు ఎన్నీ సార్లు పెట్టాలి, వయసు నిర్దిష్ట ఆహార ప్రదర్శనపై కుటుంబాలకు అవగాహనా కల్పించారు. ఆహార పరిమాణం, నాణ్యత, ఫ్రీక్వెన్సీ ఆహార వైవిధ్యంపై ఆహారప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. గర్భిణి, బాలింతలకు 1,000 రోజుల సంరక్షణ ప్రాముఖ్యతా, పౌష్టికాహారం, ఆరోగ్యం, శుభ్రతలపై, అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ హేమదేవి అంగన్వాడీ టీచర్లు ఇంద్రపల్లి సైదమ్మ, అహ్మది బేగం, పంచాయతీ కార్యదర్శి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో పాలకులు విఫలం

### ఆర్ఎస్ నేత తిరందాసు



**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 18:–** నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని బిఆర్ఎస్ జిల్లా నాయకులు తిరందాసు విష్ణు ఆరోపించారు. బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ వంట నూనెల తో పాటు పప్పు దినుసుల రేట్లు పెరిగి సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయన్నారు. దళారుల ఆగడాలను అరికట్టి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ధరలు నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయాలి

**హుజూర్‌నగర్ నవభూమి ప్రతినిధి** హుజూర్నగర్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఖాళీగా ఉన్న నాలుగు గైనకాలజిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు సోమగాని నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా డి ఎం %డ% హెచ్ ఓ డాక్టర్ కోట చలం కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూర్నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పేద ప్రజలందరూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వస్తారని, కేవలం ముగ్గురు గైనకాలజిస్టు మాత్రమే అందుబాటులో ఉన్నారని, వీరికి 24 అవర్స్ డ్యూటీ వల్ల గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు సరైన వైద్యం చేయడంలో ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కావున మరో నలుగురు గైనకాలజిస్టును త్వరలో నియమించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళాకారుడు బాదే నరసయ్య, హైకోర్ట్ అడ్వకేట్ ఇస్లావత్ బాలాజీ నాయక్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



### ప్రతి చేనేత కార్మికుల సమస్యల కోసం

# కృషి చేస్తా



**భూదాన్‌పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 18** ప్రతి చేనేత కార్మికుడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పద్మశాలి చేనేత కార్మిక సంఘం నూతన అధ్యక్షుడు అంకం పాండు తెలిపారు.పురపాలక కేంద్రంలో బుధవారం పద్మశాలి చేనేత కార్మిక సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి సీత శ్రీరాములు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారికి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసుకున్న కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉపాధ్యక్షుడిగా భారత భూషణ్. ప్రధాన కార్యదర్శిగా బొమ్మ హరిశంకర్. సహాయ కార్యదర్శిగా బిట్ల గణేష్. కోశాధికారిగా రుద్ర సూర్యప్రకాష్ కార్యవర్గ నిర్వహణగా ఎన్నుకోగా. డైరెక్టర్లుగా పుట్టబత్తి వేణు. కూరపాటి భాస్కర్. కటికం శ్యాం సుందర్. గుండేటి శివరాజ్. మహిళా డైరెక్టర్లుగా గుండు రాజేశ్వరి. గుర్రం హేమలత ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ చేనేత కార్మికులు ఐక్యత చాటడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయి దానికి అనుగుణంగా చేనేత కార్మికుల ఐక్యపరిచి రానున్న రోజుల్లో చేనేత రంగంలో ఏర్పడిన సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని వివిధ చేనేత సంస్థలకు చెందిన నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ నాయకులు అంకం మురళి, భారత బాలరత్నం, ఏలే బిక్షపతి, చింతకింది రమేష్, నాయకులు పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ తడక రమేష్, మార్కండేయ స్వామి దేవాలయం చైర్మన్ సీత సత్యనారాయణ, టై అండ్ డై అధ్యక్షులు భారత లవ కుమార్, కౌన్సిలర్ భోగభానుమతి విష్ణు, నాయకులు సూరపల్లి రమేష్, తడక గౌరీ శంకర్, మంగళపల్లి రాజా రమేష్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గంజి యుగంధర్ ప్రధాన కార్యదర్శి ఆడపు అరవింద్, మధ్యలమ్మ దేవాలయం అధ్యక్షుడు సురపల్లి రాము, నాయకులు సూరపల్లి శ్రీనివాస్, కర్నాటి అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### నూతన అధ్యక్షుడు అంకం పాండు








## అంగరంగ వైభవంగా విఘ్నేశ్వరుని శోభాయాత్ర సంబరాలు

- **శోభాయయాత్రను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి రాజేష్ రెడ్డి**

**పెన్‌పహాడ్,సెప్టెంబర్18(నవభూమి)** పరిధిలోని మాచారం గ్రామ పంచాయతీ అనిరెడ్డి గూడెం లో నిమజ్జన కార్యక్రమానికి బయలుదేరి వెళ్ళడం జరిగింది. విగ్నేశ్వరుని తొమ్మిది రోజులు ఘనంగా పూజలు అందుకున్న తర్వాత తొమ్మిదవ రోజు రాత్రి నిమజ్జన కార్యక్రమానికి ముందు ముదిరెడ్డి రాజేష్ రెడ్డి ప్రధమ దైవానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో, పాడిపంటలతో వర్ధిల్లాలని వేడుకున్నారు. అనంతరం గణేష్ శోభాయయాత్ర ను లాంచనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముదిరెడ్డి రంగారెడ్డి,చింతరెడ్డి వాసుదేవరెడ్డి రెడ్డి ,కన్నెబోయిన వెంకన్న యాదవ్ , చల్ల లింగారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు లొడంగి విజయ్ యాదవ్ , లొడంగి వినయ్ యాదవ్, చల్ల నిఖిల్ రెడ్డి ,కారింగుల గణేష్ గౌడ్ , కారింగుల లింగస్వామి, శ్రవణ్ చారి, కోవాకుల సంతోష్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## అవంతిపురం ఎస్సి కాలనీ గణేష్ ఉత్సవాల అన్నప్రసాద వితరణలో తహసీల్దార్ హరిబాబు





**మిర్యాలగూడ నవభూమి సెప్టెంబర్ 18:–** మిర్యాలగూడ మండలం అవంతిపురం ఎస్సి కాలనీలోని వినాయక మండపం వద్ద బుధవారం అంబేద్కర్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథి మిర్యాలగూడ తహసిల్దార్ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చిమట పద్మ మదార్, మాజీ ఎంపిటిసి పర్వతం లింగయ్య, శివాజీ చత్రపతి యూత్ కమిటీ సభ్యులు సుధీర్ బాబు, పద్మ, వీరయ్య, రవి, గువ్వ సైదులు, రవి, అజ్జు, గ్రామ పెద్దలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేత అవాకులు చవాకులు పేలకు ఖబర్దార్

### ఒరేయ్ నా దమ్మెంటో ..

### ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ సెప్టెంబర్ 18:–** లక్ష రూపాయల పని చేయలేదన్న బిఆర్ఎస్ నేత అవాకులు, చెవాకులు పేలితే ఖబర్దార్ అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్డుపై 4 ఫ్లై ఓవర్లకు భూమి పూజ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ చిల్లర మాటలు మాట్లాడవద్దని, తాను ప్రజల ఆశీస్సులతో రూ.180కోట్లతో ప్రజా భద్రత కోరి 4 ఫ్లై ఓవర్లు మంజూరు చేయించడం జరిగిందని ఇక నుండి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలుపుతానని కాసుకో, నా దమ్మెంటో చూపిస్తానని ఛాలెంజ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దమ్మున్న పార్టీ అని, ఇంతకన్నా ఎక్కువ చేసి చూపెడతానని అన్నారు. తప్పులు, పొరపాటు మాట్లాడవద్దని బిఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ నాయకులు, సముచిత స్థానం కల్పించి గెలిపిస్తానని ఆయన అన్నారు.



### పదేళ్లు ప్రజల ప్రాణాలను కాపాడలేదని రూ.180కోట్లతో ఫ్లై ఓవర్లు

# నిర్మించి కాపాడుతాం

- నల్లగొండ జిల్లాను ఎస్ఎల్బిసి సొరంగానికి నిధులకు కేబినెట్లో పెడతాం
- నల్లగొండ జిల్లాను బంగారు కొండ చేస్తా : మంత్రి కోమటిరెడ్డి











**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 18:–** బిఆర్ఎస్ ఎమ్మెల్యే పదేళ్లు అధికారంలో ఉన్న ప్రజల ప్రాణాల గురించి ఆలోచించ లేదు, నేడు 180 కోట్ల రూపాయల వ్యయంతో 4 ఫ్లై ఓవర్లు నిర్మించి ప్రజల కాపాడనున్నమని రాష్ట్ర రోడ్డు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణం నార్కట్ పల్లి – అద్దంకి బై పాస్ రోడ్డుపై నాలుగు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి వై జంక్షన్ వద్ద భూమి పూజ కార్యక్రమానికి చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సంవత్సరపు లోపు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించానని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్యస్ ఎస్ఎల్బిసి సొరంగం పనులు పూర్తి చేయలేదని ఎక్కడికక్కడే వదిలి పెట్టారని ఆరోపించారు. సొరంగం పనులు పూర్తి చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిధులు కేటాయించాలని కోరుతామని ఆయన తెలిపారు. పూర్తయితే జిల్లాలో 4 లక్షల ఎకరాలు సేద్యమవుతాయని నల్లగొండను బంగారు కొండ చేస్తామని ఆయన చెప్పారు. అమృత్ పథకం కింద నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి 316 కోట్ల రూపాయలు తీసుకొచ్చారని వాటితో ఓవర్ హెడ్ ట్యాంకులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఫ్లై ఓవర్లు నిర్మించడం పట్ల మంత్రి కోమటిరెడ్డికి నాగార్జునసాగ్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారంతో ఉన్నప్ ప్రజల సౌకర్యార్థం సంక్షేమ అభివృద్ధి పనులు చేస్తున్నదని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయంలో ఆగిన పనులు చేపట్టామని తెలిపారు. వ్యవసాయ, వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడలో ఫ్లై ఓవర్లు నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. మంత్రుల తోడ్పాటుతో రాష్ట్రంలో ప్రజలు మిర్యాలగూడ వైపు చూసేలా అభివృద్ధి చేస్తానని సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ పి.మధుసూదన్ రెడ్డి, ఎస్ఇ సత్యనారాయణరెడ్డి, డిసిసి అధ్యక్షుడు కె. శంకర్ నాయక్, నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

# వైభవంగా గణేష్ శోభాయాత్ర

**హుజూర్ నగర్ నవభూమి ప్రతినిధి** మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవాలు 11 రోజులపాటు ఘనంగా జరిగాయి. గణేష్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన 11 కేజీల లడ్డూను అదే గ్రామానికి చెందిన టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు వీరమల్ల సుందరయ్య శ్రీలక్ష్మి దంపతులు రూ. 11,016 రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు. బుధవారం మట్టపల్లి కృష్ణా నదిలో నిమజ్జనానికి విగ్రహాన్ని తరలించారు ఈ శోభాయాత్రలో అంబేద్కర్ యువజన కమిటీ సభ్యులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# లక్ష రూపాయలు ధర పలికిన లడ్డు

### కైవసం చేసుకున్న జల్ల రామకృష్ణ







**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 18** గణేష్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న బుగ్గ రామన్న స్వామి సంఘ సభ్యులు భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో బుధవారం స్థానిక పద్మ నగర్ కాలనీ లో గల బుగ్గ రామన్న స్వామి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ 25వ వార్షిక నవరాత్రులొత్సవాలలో భాగంగా నిమజ్జన ఊరేగింపుని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూ వేలం పాట మండలంలో అత్యధికంగా లక్ష రూపాయలు ధర పలికింది లడ్డూని జల్ల రామకృష్ణ కైవసం చేసుకోగా అనంతరం నిమజ్జన ఊరేగింపు సందర్భంగా స్వామివారిని రథం పై ఊరేగించి మేళతాళ కోలాటాల నృత్యాలతో అంగరంగ వైభవంగా నిమజ్జనం ఊరేగింపు సాగింది . ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వల్లందాస్ ప్రవీణ్, అధ్యక్షులు గుండు సాయి, కార్యదర్శి అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు వేషాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్ఛేంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల వేలం

**హుజూర్ నగర్ నవభూమి ప్రతినిధి** హుజూర్ నగర్ ఎక్స్ఛేంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసు లలో సీజ్ చేయబడిన 25 వాహనాలు కు సెప్టెంబర్ 20 వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల కు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నందు జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్. లక్ష్మా నాయక్ ఆద్వర్యంలో వేలం నిర్వహించబడును ఈ వాహనాల వేలం లో పాల్గొన దల్చిన వారు 20 వ తేదీ ఉదయం 9 నుండి స్టేషన్ నందు ముందస్తుగా దరఖాస్తు రుసుము చెల్లించి పాల్గొనగలరు.

# మహబూబాబాద్ వరద బాధితులకు రైస్ మిల్లర్ల 30 టన్నుల బియ్యం

### లారీలకు పచ్చ జెండా ఊపి పంపిన మంత్రి కోమటిరెడ్డి









**మిర్యాలగూడ నవభూమి సెప్టెంబర్ 18:–** ఇటీవల భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా బాధితుల సహాయార్థం రైస్ మిల్లర్ల అసోసియేషన్ తరపున సుమారు 30 టన్నులు బియ్యం రవాణా చేస్తున్న లారీలకు బుధవారం సాయంత్రం రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం పచ్చ జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, కుందూరు జయవేర్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు కె శంకర్ నాయక్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, రాష్ట్ర కార్యదర్శి రేపాల మధుసూదన్, ధనమల్లయ్య, మిర్యాలగూడ అధ్యక్ష, కార్యదర్శులు గౌరు శ్రీనివాస్, బి.వెంకటరమణ చౌదరి, గుడిపాటి శ్రీనివాస్, కోశాధికారి మాషెట్టి శ్రీనివాస, చిల్లంచర్ల శ్రీనివాస్, రేపాల అంతయ్య, కర్నాటి లక్ష్మీనారాయణ, గందే రాము, గుడిపాటి నవీన్ లున్నారు

# అమృతం తాగరేం..!

**నేరేడుచర్ల–నవభూమి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమృత్ 2.0 పథకం కింద భారీగా నిధుల కేటాయింపు జరిగింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 17 పురపాలికలకు ఈ పథకం కింద భారీగా నిధులు మంజూరు చేశారు. ఈ పథకం కింద చేపట్టే పనులకు 2023 సెప్టెంబరులోనే పరిపాలనా అనుమతులు లభించాయి. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఒకే సంస్థకు పనులు అప్పగించారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. టెండర్లు ఖరారై చాలా కాలం అవుతున్నా కొన్ని పురపాలికల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. సూర్యాపేట, నేరేడుచర్ల, చిట్యాల పురపాలికల్లో పనులు ప్రారంభించాల్సి ఉంది. పనులు ప్రారంభించిన పురపాలికల్లో నల్గొండలో మాత్రమే వేగవంతం అయ్యాయి. చాలా పురపాలికల్లో పనులు ఇంకా వేగం పుంజుకోలేదు. ఈ పనులు పూర్తి చేయడానికి రెండేళ్ల కాలపరిమితి ఉంది. పనులు ప్రారంభమైన చోట్ల చురుకుగా జరిగేలా, పనులు ప్రారంభం కాని చోట్ల వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

# కన్నవారు వృద్ధులు.. కదలలేని పుత్రుడు



**చౌటుప్పల్ –నవభూమి:** చౌటుప్పల్‌కు చెందిన మహేశ్‌ను చక్రాల కుర్చీలో తిప్పుతున్న తల్లిదండ్రులు నాగభూషణం, ఇంద్రమ్మ పూర్వం శ్రవణ కుమారుడు వృద్ధులైన తన తల్లిదండ్రులను కావడిలో కూర్చోబెట్టుకొని తీర్థయాత్రలు చేయించిన తరహాలో చౌటుప్పల్‌లో ఓ సన్నివేశం పునరావృతం అయింది. కానీ ఇక్కడ తల్లిదండ్రులే కుమారుడిని తిప్పుతున్నారు. బాల్యం నాగభూషణం–ఇంద్రమ్మ దంపతులు శరీరమంతా చచ్చుబడిన తమ కుమారుడు మహేశ్‌ను భుజాలపై మోస్తూ, చక్రాల కుర్చీలో కూర్చోబెట్టుకుని తిప్పుతూ 30 ఏళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఈ వృద్ధులిద్దరూ చేనేత వృత్తి పని చేసేవాళ్లు. వీరికి రెక్కాడితేనే డొక్కాడుతుంది. ముప్పయ్యేళ్ల కిందట మహేశ్ జన్మించాక.. అతనికి తొమ్మిది నెలల వయసులో రోగ నిరోధక శక్తికోసమంటూ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది టీకా వేశారట. అదే రోజున రాత్రికల్లా కాళ్లూ, చేతులూ, నడుము, శరీరమంతా క్రమంగా చచ్చుబడి పోయిందట. వైద్యులను సంప్రదిస్తే తమ చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తడంతో రాత్రికి రాత్రే హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. నెల రోజుల పాటు అక్కడ చికిత్స చేయించినా మార్పేమీ రాకపోవడంతో కుమారుడ్ని భుజానేసుకుని ఇంటికి తిరిగొచ్చేశారు. అప్పటి నుంచీ తల్లి కుమారుడికి సపర్యలు చేస్తోంది. ఇప్పటికీ 'అమ్మా..నాన్నా' అనే రెండు మాటలు తప్ప మరొకటి పలకలేదు. చంటి పిల్లాడిలా అతని కాలకృత్యాలు తీర్చి, స్నానం చేయించి, దుస్తులు తొడిగించి, గోరు ముద్దలు తినిపించాల్సిందే. 'గోరు చుట్టుపై రోకటి పోటులా' అయిదేళ్ల క్రితం కుటుంబంపై మరో దెబ్బ పడింది. మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించే నాగభూషణం కాళ్లు, శరీరం వాపుతో నీరసించడంతో ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించి కిడ్నీ చెడిపోయిందని తేల్చగా.. మగ్గం పని మానేయాల్సి వచ్చింది. ఉన్న ఒక్క జీవనాధారమైన చేనేత పని దూరమైంది. తండ్రికి, కుమారుడికి ప్రభుత్వం ఇచ్చే 'ఆసరా' పింఛను వారి ఔషధాలకే ఖర్చవుతోంది. వృద్ధాప్యంలో ఉన్న తమకు, కుమారుడికి జీవనయాత్ర సాగేదెలాగని వారు కుమిలిపోతున్నారు.

# ఆగ్రోస్ లక్ష్యం.. నిర్లక్ష్యం!

**నల్గొండ –నవభూమి:** రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించాలనేదే తెలంగాణ ఆగ్రోస్ సంస్థ లక్ష్యం. పంటలకు అవసరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు తీసుకొచ్చి వాటి పనితీరు, ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించడానికి ఉమ్మడి జిల్లాకు సంబంధించి నల్గొండ ఆగ్రోస్ కార్యాలయంలో రూ.40 లక్షల వ్యయంతో 2017లో ప్రదర్శన కేంద్రం నిర్మించారు. సలహాల కోసం సమావేశం భవనాన్ని ఏర్పాటు చేశారు. కానీ.. ఆరేళ్లుగా దీనిని ప్రారంభించలేదు. భవనాలు నిరుపయోగంగా ఉండటంతో పరిసరాల్లో పిచ్చి మొక్కలు మొలిచాయి. అందుబాటులోకి వస్తే..ఆగ్రోస్ పరికరాల ప్రదర్శన కేంద్రం అందుబాటులోకి వస్తే రైతులకు అవసరమైన విత్తే యంత్రం, కలుపు నివారణ పరికరాలు, కోత యంత్రాలు, అంతర్‌కృషి పరికరాలు వాటి పనితీరుతో పాటు ప్రయోజనాలు వివరించే అవకాశం ఉంటుంది. తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం పొందడంలో రైతులకు చేయూతనివ్వడానికి సరసమైన ధరలకు అందుతాయని అధికారులు అప్పట్లో వెల్లడించారు. పరికరాల పనితీరును చూపించడంతో పాటు వాటిపై అవగాహన కల్పించాల్సి ఉంది. ఆ ఉద్దేశ్యంతోనే అప్పట్లో నల్గొండలోని ఆగ్రోస్‌కు చెందిన 2.20 ఎకరాల్లో భారాస కార్యాలయంతో పాటు, పెట్రోల్ బంక్ నిర్మించారు. మిగిలిన ఎకరం స్థలంలో ఈ కేంద్రాన్ని నిర్మించారు. ప్రారంభించకుండా నిరుపయోగంగా వదిలేయవడం వల్ల రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

## యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ.2.98 కోట్లు






**యాదగిరిగుట్ట: –నవభూమి:** యాదాద్రి క్షేత్రంలోని ప్రధాన,అనుబంధ ఆలయాలలో గల హుండీలలో భక్తులు సమర్పించిన నగదు, నగల కానుకలను దేవస్థానం ఉద్యోగులు,భక్తులు బుధవారం లెక్కించారు.ఈ లెక్కింపులో నగదు రూ.2,98,48,233 లు, మిశ్రమ బంగారం 205 గ్రాములు,వెండి 5,710 గ్రాములు చేకూరినట్లు శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి భాస్కర రావు తెలిపారు.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి,డీఈవో భాస్కర శర్మ తో పాటు వివిధ విభాగాల బాధ్యులు,ఉద్యోగులు, సేవా సమితి కి చెందిన మహిళా సేవకులు పాల్గొన్నారు. విదేశీ కరెన్సీ సైతం హుండీల్లో లభించాయని ఈవో పేర్కొన్నారు.

## సాగునీటికి తిప్పలే..!



**హుజూర్‌నగర్, –నవభూమి:** భారీ వర్షాలకు పడిన గండ్లు రైతులకు కడగండ్లే మిగిల్చాయి.గండ్లు పూడ్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఇప్పటికే 19 రోజుల నుంచి నీరు లేక నాటు వేసిన పొలాలు నెర్రెలు ఇచ్చాయి. నెల క్రితం నాటు వేసిన పొలాలు కొంత మేరకు బాగానే ఉన్నాయి. ప్రస్తుత నీటి ఎద్దడిని అవి తట్టుకునే స్థాయిలో ఉన్నాయి. కానీ ఇటీవలే నాటు వేసిన పొలాలు మాత్రం ఎండు ముఖం పట్టాయి.ఎంబీ కెనాల్ పరిధిలో... ఎంబీ కెనాల్ పరిధిలో దాదాపు 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ఎక్కువ మంది రైతులు బోర్లు, బావులు తీసుకోవడం వల్ల ప్రస్తుతం నీరు రాకపోయినా పంటలను రక్షించుకుంటున్నారు. అవి లేకుండా కేవలం కాలువ నీటిపైనే ఆధారపడ్డ రైతుల పంటలు ఎండుముఖం పట్టాయి. త్వరితగతిన గండి పూడ్చివేత పనులు పూర్తి చేసి నీరు విడుదల చేయకపోతే రైతులు నాటు వేసిన పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఎడమ కాలువకు పడిన గండి పూడ్చి వేత పనులు జరిగే వరకు ఆగకుండా అవకాశం ఉన్న మేరకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కేవలం కాలువ నీటిపైనే ఆధారపడి సాగు చేసిన విస్తీర్ణం దాదాపు 40వేల ఎకరాల పైచిలుకు ఉంటుందని చెబుతున్నారు. అందులో ఆలస్యంగా నాట్లు వేసిన రైతులకు దాదాపు 30వేల ఎకరాల వరకు ఉంటుందని అంచనా.అన్నింటికీ అడ్డంకిగానే... ముందస్తుగా నాటు వేసిన వాటికి నీరు లేక కలుపు తీసే, యూరియా వేసుకునే పరిస్థితి లేదు. దీనివల్ల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఆలస్యంగా నాటు వేసిన వాటికి నీరందితేనే ఊపిరి పోసుకుంటాయి. ఇంకా నాటు వేయని వారు ఇక ఈ సీజన్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని అంటున్నారు. అధికారులు మాత్రం మరో రెండు, మూడు రోజుల్లో నీరు విడుదల చేస్తామని చెబుతున్నారు.

# నష్టాల ముంగిట పత్తి



**కోదాడ, –నవభూమి:** ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలో పది రోజుల పాటు నీరు నిల్వ ఉంది. పత్తి చేనులో నీరు నిలిచి అధిక పదును ఉండటంతో మొక్కకు ఉన్న గూడ, పూత రాలిపోయింది.నీళ్లు నిల్వ ఉన్న చోట పత్తి మొక్క మొదలు ఎండిపోతోంది. దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు.భారీ వర్షాలకు తీరని నష్టం..భారీ వర్షాలు పడటంతో పత్తి మొక్కలు ఒరిగిపోయాయి. వరదకు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో కొన్నిచోట్ల మొక్కలు చనిపోయాయి. పది రోజుల పాటు నిత్యం వర్షం పడటంతో గడ్డి విపరీతంగా పెరిగింది. దీంతో తెల్ల దోమ, పచ్చ దోమ, పురుగు ఉండటంతో చేనును రక్షించేందుకు విపరీతంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు దుక్కిమందు, యూరియా వేయడంతో పాటు పిచికారీ చేశారు. గడ్డిని తొలగించేందుకు అధిక ఖర్చు వచ్చింది. ఒక్కో ఎకరానికి అన్ని ఖర్చులు కలుపుకొని రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. విపరీతంగా గూడ, పూత రాలడంతో ఎకరానికి దిగుబడి అమాంతం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దుక్కి దున్నినందుకు, విత్తనాలు, దుక్కి మందు, యూరియా చల్లడం, పిచికారీ మందులు ఇలా అన్ని ఖర్చులు కలిపి ఇప్పటికే రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తి పంట పూత, పిందె రాలిపోయింది. ఈ ఏడాది పత్తి దిగుబడి వచ్చే అవకాశం లేదు.సైదులు, రైతు, తాడువాయి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి పది రోజుల పాటు భారీ వర్షాలు పడటంతో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. రైతులు లోతట్టు ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా చర్యలు చేపట్టాలి. గూడ, పూత, పిందె దశలో అధిక పదును ఉండటంతో అవి రాలిపోతున్నాయి. రైతులు ప్లానోఫిక్స్ మందును పిచికారీ చేయాలి. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే భారీ నష్టం వాటిల్లుతుంది.

# వెదురు..పర్యావరణ కుదురు



**చౌటుప్పల్, –నవభూమి:** 'వెదురు'.. దీనికి 'ఆకుపచ్చ బంగారం, ప్రజల స్నేహితుడు, పేదవాడి కలప' అనే పేర్లున్నాయి.కృష్ణుడి చేతిలోని పిల్లనగ్రోవి వెదురుతో తయారు చేసిందే.. రైతు చేతిలోని ముల్లుగర్ర, పోలీసు చేతిలోని లాఠీ వెదురు కలపే.. పేదల గుడిసెలే కాదు ధనికులు ఆధునికంగా నిర్మించుకునే ఇళ్లకూ దీన్నే ఉపయోగిస్తున్నారు. వెదురు చెట్టు వర్షానికి వచ్చే వరద ప్రవాహంలో భూసారం కొట్టుకుపోకుండా కాపాడుతుంది. వాన నీరు వృథా పోకుండా భూమిలో ఇంకేలా సంరక్షిస్తుంది. పర్యావరణాన్ని రక్షణగా.. అడవుల క్షీణతను అడ్డుకుంటుంది. అడవులే ఆలంబనగా జీవించే గిరిజనులను ఉపాధి కల్పిస్తుంది.వెదురుతో వ్యవసాయ పరికరాలు, గృహోపకరణాలు, సంగీత వాయిద్యాలు తయారు చేస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. కశ్మీర్ మినహా దేశమంతటా 23 జాతులకు చెందిన 136 రకాల వెదురు వనాలున్నట్టు గణాంకాల్లో గుర్తించారు. ఇసుకతో కూడిన బంకమన్ను, ఎర్ర, నల్లరేగడి నేలల్లో ఇది బాగా పెరుగుతుంది. దీన్ని అటవీ చట్టాల నుంచి మినహాయించి ఉద్యాన పంటగా గుర్తించారు. ఏటా సెప్టెంబరు 18న ప్రపంచ వెదురు దినోత్సవంగా 2009 నుంచి నిర్వహిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర బాంబూ మిషన్‌లు రాయితీలు అందించి వెదురు సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నాయి.చౌటుప్పల్ తంగేడువనంలో వెదురు తోరణం చౌటుప్పల్‌లో వనం..చౌటుప్పల్ అటవీ క్షేత్రం పరిధి లక్కారంలోని తంగేడువనంలో ప్రత్యేకంగా వెదురు వనం విభాగం ఉంది. అడవుల్లో భూసారం కొట్టుకుపోకుండా, పర్యావరణాన్ని కాపాడేందుకు, ఉపాధికి, ఆదాయానికి వెదురు ఉపయోగకరంగా ఉంటుంది. అవగాహన కల్పించేందుకు ఈ ప్రాంతానికి అనుకూలమైన 12 రకాల వెదురు చెట్లను ఈ వనంలో పెంచుతున్నాం.ఏ.సతీశ్‌బాబు, అటవీ క్షేత్రాధికారి, చౌటుప్పల్ సాగుకు ప్రోత్సాహం వెదురు సాగు రైతులకు లాభదాయకం. ఒక హెక్టారు విస్తీర్ణంలో సాగుకు రూ.40వేలు ఖర్చవుతుంది. పొలం గట్లమీద హెక్టారు విస్తీర్ణంలో 130 మొక్కలు పెంచుకోవచ్చు. ఒక్కో మొక్క పెంచేందుకు రూ.240 ఖర్చవుతుంది. అందులో యాభై శాతం రాయితీని మూడేళ్ల కాలంలో బాంబూ మిషన్ మంజూరు చేస్తుంది. వెదురుతో ఎన్నో ఉపయోగాలున్నాయని అవగాహన కల్పిస్తున్నాం.

